ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
ఆదివారం | 15 మార్చి 2026 | 10 పేజీలు



10

బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించిన

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



10

చిరుతపులిని హతమార్చిన

# వేటగాళ్ల అరెస్టు

■ ప్రభాత సమాచారం, జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లో విషాదం

■ ఉచ్చు వేసి చిరుతపులిని హతమార్చిన కిరాతకులు ■ 13గోర్లు స్వాధనం చేసుకున్న అటవీ అధికారులు

■ ఆధారాలు దొరకుండా మృతదేహం దహనం ■ స్నిఫర్ డాగ్ 'హంటర్' సాయంతో నిందితుల గుర్తింపు ■ కొనసాగుతున్న దర్యాప్తు

జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాడ్లపేట రేంజ్‌లో చిరుతపులిని హతమార్చిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జన్నారం ఎఫ్‌డీఓ రాంమోహన్ శనివారం తెలిపారు. నిందితుల వద్ద నుంచి 13 చిరుత పులి గోర్లు సహా వన్యప్రాణులకు సంబంధించిన ఇతర వస్తువులను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దండేపల్లి మండలానికి చెందిన కొందరు వ్యక్తులు వన్యప్రాణి అవశేషాలను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని అందిన సమాచారం మేరకు అటవీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఊట్ల గ్రామానికి చెందిన మొద్దె వెంకటేష్, మొద్దె శ్రీనివాస్, పాతమామిడిపల్లికి చెందిన వనపర్తి శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితులు దండేపల్లి మండలం ఊట్ల గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మోటారు వాహనాల క్లచ్ వైర్లతో ఉచ్చులు వేసి చిరుతపులిని వేటాడినట్లు తేలింది. చిరుతపులి గోర్లను తొలగించి మృతదేహాన్ని కాల్చి వేసినట్లు అధికారులు గుర్తించారు. సంఘటన జరిగిన ప్రదేశాల నుంచి అటవీ అధికారులు కీలక సాక్ష్యాలను సేకరించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 13 చిరుతపులి గోర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌డీఓ తెలిపారు.



ప్రారంభమైన

# పది పరీక్షలు

■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తొలి రోజు ప్రశాంతం..

■ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు, ఎస్పీలు..

■ పరీక్షా కేంద్రాల వద్ద 114 సెక్షన్ అమలు...

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు పరీక్షలు జరుగగా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలలో తమకు కేటాయించిన గదులను పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి వెళ్లారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లాలో కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, మంచిర్యాలలో కుమార్ దీపక్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో హరిత పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.



10

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ లీగల్ సెల్

# నాయకుడు మట్టేరి రాజశేఖర్

ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సమక్షంలో బీజేపీ లీగల్ సెల్ ఖానా పూర్ నియోజకవర్గ నాయకుడు మట్టేరి రాజశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ న్యాయవాది రాజురా సత్యం ఆధ్వర్యంలో ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే సందర్భంగా యువ న్యాయవాది షేఖ్ ఖదీర్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన న్యాయవాది మట్టేరి రాజశేఖర్ మాట్లాడుతూ ఖానాపూర్‌లో కోర్టు భవనం లేకపోవడం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

శారీరక, మానసిక

## ఉల్లాసానికి క్రీడలే మార్గం

■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

■ రెవెన్యూ ఉద్యోగుల క్రికెట్ పోటీలను ప్రారంభం

■ ఒత్తిడిని జయించేందుకే క్రీడా పోటీల నిర్వహణ

■ ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలోటోర్నీ



4

రెవెన్యూ ఉద్యోగులకు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని శ్రీ ఉషోదయ పాఠశాల మైదానంలో ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలకు అదనపు కలెక్టర్ చంద్రయ్య, శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో కలిసి ప్రారంభించారు.

జిల్లాలో గ్యాస్

# సిలిండర్ల కొరత లేదు

■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

■ గృహ, విద్యా, వైద్య అవసరాలకు సరిపడా నిల్వలు సిద్ధం

■ పుకార్లను నమ్మవద్దు.. ప్రజలు ఆందోళన చెందవద్దు

■ డొమెస్టిక్ సిలిండర్లు దారి మళ్లిస్తే కఠిన చర్యలు

■ వాణిజ్య అవసరాలకు వాడితే కేసులు తప్పవు

■ అక్రమ నిల్వలు, తూకంపై పౌర సరఫరాల శాఖ నిఘా

వివరాలు 3లో





### పారదర్శకంగా, పకడ్బందీగా
# టెన్త్ పరీక్షల నిర్వహణ

- నిర్మల్ బాలికల పాఠశాల కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- సౌకర్యాలపై సంతృప్తి.. అధికారులకు ఆదేశాలు
- విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలి
- పరీక్ష కేంద్రంలో వసతులను పరిశీలించిన కలెక్టర్



**నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** పట్టణంలోని సోమవార్ పేట్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అధికారులను ఆదేశించారు. శనివారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైనందున, పట్టణంలోని సోమవార్ పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు పరీక్షా గదులను తిరుగుతూ, పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అని చూశారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన బెంచీలు, లైటింగ్, త్రాగునీరు, తదితర మౌళిక సౌకర్యాలు కల్పించారో లేదో పరిశీలించారు. ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ, పరీక్ష కేంద్రంలో కేటాయించిన విద్యార్థుల సంఖ్య, హాజరైన విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, తదితర అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్ష రాసేలా పటిష్ట ఏర్పాట్లు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకంగా పరీక్షల ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని పటిష్ట ఏర్పాట్లు చేశామని వివరించారు. ఎక్కడ కూడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగుతున్నాయని, అన్ని పరీక్షలను పకడ్బందీగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రం తనిఖీలో డిఈఓ భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పీఎం సూర్య ఘర్ పథకంపై
# అవగాహన కల్పించాలి

**అవగాహన రథాన్ని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరం ఆవరణలో పీఎం సూర్య ఘర్' అవగాహన రథాన్ని జెండా ఊపి ప్రారంభించి, సంబంధిత పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా. పాల్గొన్న డిపిఓ రమేష్, డిపిఆర్ఓ ఇ.విష్ణువర్ధన్, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఈడియం రవి, రెడ్కో డి ఏం శ్రీనివాస్, జూనియర్ మేనేజర్ శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సేవ్ సింగరేణి పోస్టర్ విడుదల

**మందమర్రి, మార్చి 14 (ప్రభాత సమాచారం)** కేకే-5 గని వద్ద ఏఐటియూసి ఆధ్వర్యంలో సింగరేణి పోస్టర్ ను నాయకులు ఆవిష్కరించారు. సింగరేణి సంస్థను పరిరక్షించాలని కోరుతూ 'సేవ్ సింగరేణి' కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. పాత పద్ధతిన మెడికల్ బోర్డు నిర్వహించాలని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న అన్ని గనులు, డిపార్ట్మెంట్ల ముందు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేపడతామని వారు వెల్లడించారు.

# పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ



**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైన నేపథ్యంలో పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మరియు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నట్లు పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉన్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో ప్రజలు గుమికుడి ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, పరీక్ష పూర్తి అయ్యేంతవరకు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వెలుపలి ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ గస్తీ నిర్వహిస్తూ ఉండడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాలలోనికి ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచ్లు, ఇయర్ ఫోన్స్ లాంటి వాటికి అనుమతులు లేవని, లోనికి వెళ్లే ముందు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి అనుమతి ఇస్తారని తెలిపారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న ప్రతి ఒక్కరికి శు భాకాంక్షలు తెలియజేశారు.

# దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు



**ముథోల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లాలోని భైంసా డివిజన్ వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. డివిజన్ పరిధిలోని వివిధ పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. దీంతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి కనిపించింది. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పలుచోట్ల వికలాంగులపై సిబ్బంది ఏర్పాట్లను చేశారు.




## తొలిరోజు సాఫీగా పది పరీక్షలు

**జైనూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జై నూర్ మండల కేంద్రంలో శనివారం 10వ తరగతి పరీక్షలు సాఫీగా సాగాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 209 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా , ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో 270 విద్యార్థులు పరీక్షలు రాసినట్లు పరీక్షల అధికారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 100 మీటర్ల పరిధిలో ఉన్న ఫోటో కాపీ జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కేంద్రాలను మూసి ఉంచేలా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు మరుగుదొడ్లు మంచినీటి వసతి, ఆరోగ్య సిబ్బందిని నియమించారు.

### ఆదిలాబాద్ జిల్లాలో
## కొనసాగుతున్న గ్యాస్ కష్టాలు

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** జిల్లా కేంద్రంలో రెండో రోజు వంటగ్యాస్ కష్టాలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని తిరుపల్లి రోడ్‌లో గల విమల్ గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోగదారులు ఖాళీ సిలిండర్లతో బారులు తీరారు. గ్యాస్ సిలిండర్‌లు అందుబాటులో లేకపోవడంతో నిర్వాహకులు బుకింగ్ చేసుకున్న వారికి రశీదులు రాసుకొని ఇస్తున్నారు. ప్రస్తుతం సిలిండర్లు అందుబాటులో లేవని స్టాక్ వచ్చిన తర్వాత తీసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో వినియోగదారులు ఖాళీ సిలిండర్లతో వెను తిరుగాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు గ్యాస్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# కేజీబీవీ విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**లక్ష్మణచందా, మార్చి 14 (ప్రభాత సమాచారం)** మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.83 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు బీజేపీ ఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణచందా మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే రూ.10 లక్షల వ్యయంతో కేజీబీవీ స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. మండలంలోని రాచాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో ఎస్‌హెచ్‌జీ (వీవో) భవనం, రూ.20 లక్షలతో వర్కింగ్ షెడ్, రూ.24 లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.5 లక్షలతో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పొట్టపెల్లి గ్రామంలో రూ.10 లక్షలతో ఎస్‌హెచ్‌జీ (వీవో) భవనం, రూ.10 లక్షలతో వర్కింగ్ షెడ్, రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.30 లక్షలతో ఎల్లమ్మ మందిర నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. లక్ష్మణచందా మండల కేంద్రంలో రూ.40 లక్షలతో నాలుగు ఎస్‌హెచ్‌జీ (వీవో) భవనాలు, రూ.40 లక్షలతో నాలుగు వర్కింగ్ షెడ్లు, రూ.60 లక్షలతో ఐదు అంగన్‌వాడీ భవనాలు, రూ.10 లక్షలతో కేజీబీవీ స్కూల్ కాంపౌండ్ వాల్, రూ.30 లక్షలతో ధాన్యం నిల్వ గోదాం, రూ.3 లక్షలతో ఎస్సీ మాదిగ సంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రామనాథ్, సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఎంపీడీవో రాధా రాథోడ్, డిప్యూటీ తహసీల్దార్ బాబు సింగ్ రాథోడ్, సర్పంచ్ ఓసా కవిత రాజు, మాజీ ఎంపీపీ అడ్వాలా రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నయ్య, మాజీ ఎంపీటీసీ సురేష్, మాజీ సర్పంచ్ సురకంటి ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా - గృహ, విద్యా, వైద్య అవసరాలకు సరిపడా నిల్వలు సిద్ధం**
**పుకార్లను నమ్మవద్దు.. ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదు - డొమెస్టిక్ సిలిండర్లు దారి మళ్లిస్తే కఠిన చర్యలు**
**వాణిజ్య అవసరాలకు వాడితే కేసులు తప్పవు - అక్రమ నిల్వలు, గ్యాస్ తూకంపై పౌర సరఫరాల శాఖ నిఘా**

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో గృహ అవసరాలతో పాటు విద్యాలయాలు, ఆసుపత్రులకు అవసరమైన ఎల్.పీ.జీ. సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రాజేశ్వర్‌తో కలిసి గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, చమురు కంపెనీల సేల్స్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రతిరోజూ బుకింగ్, సరఫరా వివరాలపై నివేదిక సమర్పించాలని డీలర్లను ఆదేశించారు. ముఖ్యంగా ఆసుపత్రులు, వసతి గృహాలు, అనాధ శరణాలయాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు నిరంతరాయంగా గ్యాస్ సరఫరా చేయాలని సూచించారు. గృహ అవసరాలకు కేటాయించిన డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లించినా లేదా అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టేందుకు పౌర సరఫరాల అధికారులు, డి.టి.లు, ఎస్.ఐ.లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు సకాలంలో డెలివరీ అందాలని, డెలివరీ బాయ్స్ సిలిండర్లను దారి మళ్లించకుండా డీలర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే, సిలిండర్లలో గ్యాస్ తూకం కచ్చితంగా ఉండాలని, తూనికల కొలతల శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు చమురు కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించి గ్యాస్ సిలిండర్ల నిల్వలు, ఆన్లైన్ బుకింగ్, ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సురేందర్, అటవీశాఖ అధికారులు ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆర్డీఓ స్రవంతి, జిల్లా పౌర సరఫరాల అధికారి నందిని, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.






## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**జన్నారం, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలం కవ్వాల్ సర్పంచ్ సక్రూ నాయక్ కుమారుడు ఇటీవలే మృతి చెందిన విషయం తెలుసుకున్న నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్  సర్పంచ్ సక్రు నాయక్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని అన్నారు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఎల్లప్పుడూ  అండగా ఉంటుందని  ఆయనను ఓదార్చారు. మరియు కాంగ్రెస్ కార్యకర్త సత్తెన్నగౌడ్ ఇటీవల మృతి చెందాగా వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని పార్టీ , ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తో పాటు మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్ దుర్గమ్ లక్ష్మీనారాయణ పలువురు  సర్పంచులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, దాతృత్వానికి ప్రతీక రంజాన్ : ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి ప్రతీక అని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఆదిలాబాద్ లోని ఖిజార మస్జిద్ లో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి ఖర్జూర పండు తినిపించి ఉపవాస దీక్ష విరమించారు. అనంతరం మస్జిద్ పరిసరాలను పరిశీలించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రంజాన్ మాసంలో నిరుపేదలకు అండగా నిలబడడం అభినందనీయమని పేర్కొన్నారు.



## ఆవులను తరలిస్తున్న వాహనం పట్టివేత.. ఇద్దరిపై కేసు



**ఖానాపూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
అక్రమంగా పశువులను తరలిస్తే కట్టిన చర్యలు తీసుకుంటామని ఖానాపూర్ సి ఐ అజయ్ కుమార్ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఒక వాహనాన్ని శనివారం పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. తమకు వచ్చిన పక్క సమాచారం మేరకు ఖానాపూర్ లో వెకిల్ చెకప్ నిర్వహించగా, కడెం మండలం బెల్లాల్ నుంచి ఖానాపూర్ కు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయటం జరిగిందని సీఐ అజయ్ కుమార్ తెలిపారు. ఈ వాహనంలో మూడు ఆవులు ఉన్నాయని, వాహనాన్ని సీజ్ చేస్తూ ఇద్దరిపై కేసు నమోదు చేస్తూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆవులను గోశాలకు తరలించినట్లు సి ఐ అజయ్ కుమార్ పేర్కొన్నారు.



**కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలు**

## జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల్లో అధికారుల ఆకస్మిక తనిఖీలు

**నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు శనివారం మండలాల్లో అధికారులు గ్యాస్ ఏజెన్సీలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. తహసిల్దార్లు, పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఏజెన్సీలలో తనిఖీలు చేశారు. ఆయా మండలాల్లో గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల్లో గల స్టాక్, అమ్మకానికి సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. అన్ని రకాల రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. గోదాములలో గల సిలిండర్లను పరిశీలించారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితులలో సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించవద్దని ఆదేశించారు. ప్రజల అవసరాల మేరకు సిలిండర్లను అందించాలని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ లో అమ్మిన, పక్కదారి పట్టించిన, కృత్రిమ కొరత సృష్టించిన, కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ల కొనుగోలు కొరకు వచ్చిన ప్రజలతో పలువురు అధికారులు మాట్లాడుతూ, జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, తగినంత స్టాక్ అందుబాటులో ఉందని, ప్రజల అవసరాల మేరకు సిలిండర్లను అందిస్తామని వారికి తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల విషయంలో భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని వివరించారు.



# ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై జిల్లా కలెక్టర్ సమీక్ష






**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఓటరు మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు రాజకీయ పార్టీలు, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ అర్బన్, మావల మండలాల బి.ఎల్.ఓలు, సూపర్‌వైజర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మ్యాపింగ్ పురోగతిపై ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2002 నాటి ఓటరు జాబితా, ప్రస్తుత జాబితాను పోల్చి చూస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. 30 శాతం కంటే తక్కువ మ్యాపింగ్ ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలు తమ తరపున బూత్ లెవల్ ఏజెంట్లను వెంటనే నియమించి, వారికి సంబంధించిన జాబితాలను అందజేయాలని కోరారు. బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏలు సమన్వయంతో పనిచేస్తే ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించవచ్చని తెలిపారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల కోసం ఫారం-6, ఫారం-8 సమర్పించేటప్పుడు అవసరమైన 12 రకాల ధృవీకరణ పత్రాలలో ఏవైనా సమర్పించవచ్చని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆధార్ కార్డును గుర్తింపు కార్డుగా పరిగణిస్తున్నామని వివరించారు. ఇంటింటి సర్వే సమయంలో ఇంట్లో ఎవరు లేని పక్షంలో బి.ఎల్.ఓలు కనీసం మూడుసార్లు ఆ ఇంటిని సందర్శించాలని ఆదేశించారు.  ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, మున్సిపల్ కమిషనర్ రాజు, ఆదిలాబాదు పట్టణం, గ్రామీణ, మావల మండలాల తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, వేణు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు పంచాపూల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఓలు, సూపర్ వైజర్లు, వార్డు ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలే మార్గం






**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**
**రెవెన్యూ ఉద్యోగుల క్రికెట్ పోటీలను ప్రారంభం**
**పని ఒత్తిడిని జయించేందుకే క్రీడా పోటీల నిర్వహణ**
**ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ టోర్నీ**
**టెన్త్ పరీక్షా కేంద్రం ఆర్.బి.హెచ్.వి. పాఠశాల సందర్శన**

**మంచిర్యాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
రెవెన్యూ ఉద్యోగులకు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని శ్రీ ఉషోదయ పాఠశాల మైదానంలో ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులకు పని ఒత్తిడి అధికంగా ఉంటుందని, ఒక్కొక్కసారి నిర్ణీత పని వేళలను మించి పని చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ తరుణంలో రెవెన్యూ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడంతో పని ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. కార్యాలయాలలో పని ఒత్తిడి దృష్ట్యా శారీరక శ్రమ లేకుండా పని చేయడంతో 40 సంవత్సరాల వయసుకే దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉద్యోగులకు శారీరక శ్రమ తప్పనిసరిగా ఉండాలని, నిత్యజీవితంలో వ్యాయామం ఒక భాగంగా పాటించాలని తెలిపారు. అనంతరం ఆర్.బి.హెచ్.వి. పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఏప్రిల్ 16వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోసిట్ 1, 2 పరీక్ష ఉదయం 9.30 గం॥ల నుండి మధ్యాహ్నం 12.50 గం॥ల వరకు, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గం॥ల నుండి 11 గం॥ ల వరకు, ఎస్.ఎస్.సి. ఒకేషనల్ కోర్స్ (థియరీ) పరీక్ష ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు, మినహా మిగతా పరీక్షలు ఉదయం 9.30 గం॥ల నుండి మధ్యాహ్నం 12.30 గం॥ల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు.



# థర్డ్ పార్టీ అప్లికేషన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
ఏఐ వీడియో మెసేజెస్,సోషల్ మీడియా ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, బిజినెస్ ఫ్రాడ్, ఫేక్ కాల్స్, బ్లాక్మెయిలింగ్, డిజిటల్ అరెస్ట్ లాంటి నూతన సైబర్ నేరాలు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో "ఖాకీ కిడ్స్" ద్వారా అవగాహన కార్యక్రమాలు. భారతదేశంలో సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు మితిమీరి అమాయకులను మోసం చేస్తున్న సందర్భంలో ప్రజలు పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. అప్రమత్తతోనే, అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని జిల్లాలోని సైబర్ బృందాలచే ప్రతి పోలీస్ స్టేషన్ల వారిగా నూతనంగా ఏర్పాటు చేయబడిన "ఖాకి కిడ్స్" అనే కార్యక్రమంలో ద్వారా పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈరోజు జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్న తీరు ప్రస్తుత సమాజంలో ప్రజలు మోసపోతున్న సందర్భాలపై వివరణను అందించారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930కు సంప్రదించాలని, లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు తమ ఫిర్యాదులను నమోదు చేయాలని తెలిపారు. ఆర్థిక నేరాలలో గోల్డెన్ హవర్ ముఖ్యమైనదని, గంటలోపు ఫిర్యాదు చేసిన వారి నగదు తిరిగి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సమాజంలో ముఖ్యంగా థర్డ్ పార్టీ అప్లికేషన్లను వినియోగిస్తూ మొబైల్ ఫోన్లో వాటికి పూర్తిగా అనుమతులను ఇవ్వడం వల్ల మొబైల్ ఫోన్ డాటా అనేది చోరీకి గురవుతుందని, దానివల్ల సామాన్య ప్రజల వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లి బ్లాక్ మెయిల్ కి పాల్పడే అవకాశం ఉన్నందున థర్డ్ పార్టీ అప్లికేషన్లు వినియోగాన్ని నిరోధించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వెబ్సైట్లను అప్లికేషన్లను ఇన్స్టాల్ చేసుకోకుండా ఉండాలని తెలిపారు. ఈ అప్లికేషన్లలో ముఖ్యంగా లోన్ ఆప్స్, ఏపీకె ఫైల్స్ ఉంటాయని తెలిపారు. అదేవిధంగా సోషల్ మీడియా నందు జాబ్ ఫ్రాడ్, వర్క్ ఫ్రం హోం, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, బిజినెస్ ఫ్రాడ్, ఏఐ ఆధారిత వీడియో మెసేజ్ లతో సందేశాలతో కూడిన ఫ్రాడ్, కస్టమర్ కేర్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, లాంటివి నూతన సమాజంలో ప్రస్తుతం చలామణిలో ఉన్న నేరాలు వీటిని వల్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు వస్తాయని అత్యాశ చూపి మోసగాళ్లు అమాయకులను, యువతను, విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తుంటారని తెలిపారు. సమాజంలో అధికారుల పేరుతో మోసం చేసే ప్రయత్నం, పేరుతో డబ్బులు పంపాలనే ప్రయత్నం సైబర్ నేరగాళ్లు చేస్తుంటారని బాధితులు ఎలాంటి వాటిని నమ్మకుండా నిర్భయంగా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలన్నారు.



## ప్రజలకు ఇబ్బందులు లేకుండా
# గ్యాస్ సిలిండర్ల సరఫరా
### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎల్ పి జి సిలిండర్లు సరఫరా చేస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో డిసిపి భాస్కర్, జిల్లా అదనప కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు, ఎసిపి ప్రకాష్లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ఎల్ పి.జి డీలర్లతో సమావేశం నిర్వహించి జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు అవసరానికి సరిపడా అందుబాటులో ఉన్నాయని, సిలిండర్ల బుకింగ్, నిల్వలపై సమీక్షిస్తున్నామని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలు, గోదాముల వద్దకు వెళ్లకుండా ఆన్లైన్లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని తెలిపారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో వినియోగదారులు డెలివరీ బాయ్కు ఓటిపి చెప్పి సహకరించాలని, హోటల్, రెస్టారెంట్లలో వాణిజ్య సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లు ఉపయోగించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్లో సిలిండర్లను విక్రయించాలని చూస్తే నిత్యవసరల సరుకుల చట్టం 1955 క్రింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద, ఆన్ లైన్, గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్, యాప్లో, గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.



## భోసి గ్రామంలో
# దొంగల బీభత్సం
### 79 వేల నగదు చోరీ

**ముథోల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని భోసి గ్రామంలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు బీభత్సం సృష్టించారు. అర్దాపూర్ గంగాధర్ కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లగా, దుండగులు ఇంటి తాళం పగలగొట్టి రూ. 79 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అలాగే, సాయినాథ్ అనే వ్యక్తి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా రూ. 1000 నగదు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు
# సమర్ధవంతంగా నిర్వహించాలి

**మంచిర్యాల, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజులకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 55వ డివిజన్ లో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. శుభ్రత పనులు, చెత్త సేకరణ విధానం, కాలువల పరిశుభ్రత తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, చెత్త సేకరణ, పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ళ క్లియరెన్స్, తాగునీటి సరఫరా, ఇతర అన్ని అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం 10వ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో నస్పూర్, తీగల్ పహాడ్ లలోని జిగ్స్ ఉన్నత పాఠశాల, ఆక్స్ఫర్డ్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన



పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల తీరు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సౌకర్యాల కల్పన, పరీక్షల పర్యవేక్షకులు, స్క్వాడ్, ఇన్విజిలేటర్ల నియామకం, జిరాక్స్ సెంటర్ల మూసివేత, వైద్య శిబిరం, త్రాగునీరు, నిరంతర విద్యుత్ ఇతర అన్ని అంశాలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



### పదో తరగతి పరీక్షలు

# ప్రశాంతంగా నిర్వహించాలి

### పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో.. ఆదిలాబాద్ పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డులో ఉన్న సరస్వతి శిశు మందిర్, వినాయక్ చౌక్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2 కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి గదిని తిరుగుతూ పరీక్ష జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వెలుతురు, ఫ్యాన్లు, తాగునీరు, బెంచీలు వంటి కనీస మౌలిక వసతులు ఉన్నాయా? లేదా? అని స్వయంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో ఆరా తీస్తూ.. హాజరు శాతంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. "విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాసేలా చూడాలన్నారు. జిల్లావ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌వైపే ప్రజలు

### ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. శనివారం ఆసిఫాబాద్‌లోని ఆమె నివాసంలో వాంకిడి మండలం పాటగూడా గ్రామ సర్పంచ్ సోయం శ్రీదేవి-సంజీవ్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజల సంక్షేమం కేసిఆర్ తోనే సాధ్యం అనే నమ్మకంతో ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీ ఇచ్చి గద్దెనిక్కిందని ఆరోపించారు. నన్ను రోజుల్లో ప్రజలే ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాశ్, వైస్ చైర్మన్ అహ్మద్, వాంకిడి, ఆసిఫాబాద్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అజయ్, రవీందర్, అఖిల గాండ్ల తేలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సందీప్, వాంకిడి మాజీ సర్పంచ్ తుకారం, నాయకులు హైమద్, నిసార్, నారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

### మున్సిపల్ చైర్మన్ మింగ్రే ఆకాష్



**ఆసిఫాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మింగ్రే ఆకాష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ఆయనను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ... తాను చదువుకున్న పాఠశాలలోనే మున్సిపల్ చైర్మన్‌గా సన్మానం పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వేసవి కాలంలోపే పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోర్‌వెల్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. గతంలో పాఠశాలలో విధులు నిర్వహించి పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నాగరాణి, ఉమారాణిని శాలువాలతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఉపాధ్యాయులు శ్రావణ్, గంగాధర్ రెడ్డి సన్మానించారు.

## పశువులకు గాలి కుంటు టీకాలు పంపిణీ



**బజార్‌హత్నూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** మండలంలోని దేగామ గ్రామంలో పశువులకు ఉచిత గాలి కుంటూనివారణ టీకాల శిభిరన్నీ స్థానిక డాక్టర్ పర్వేజ్ ఆహ్మద్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని పశువులకు గాలి కుంటు టీకాలు వేసి పశు పోషకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో పశువులు ఎండలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుర్వ దేవుబాయి, సిబ్బంది అరవింద్, మారుతీ, దుర్గాజీ, సుధాకర్, జగన్, ఠాకూర్ సూరజ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం

### మండల ఎంపీడీఓ గంగా సాగర్ రెడ్డి

**కుభీర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** గ్రామ పంచాయతిలో ప్రతి నిత్యం ప్రజల మధ్య ఉండి వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా పారిశుధ్య కార్మికులు ఎంతో కృషి చేయడం జరుగుతుందని మండల పరిషత్ అధికారి గంగాసాగర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన కుభీర్ ఎంపీడీఓ కార్యలయంలో 99రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుధ్య కార్మికులకు శలవా పూల మాలతో ఘనంగా సన్మానించి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలో ప్రతిరోజు పారిశుధ్య కార్మికులు వారు చేస్తున్న పనులను దృష్టిలో ఉంచుకొని వారి ఆత్మ గౌరవాన్ని ప్రతి ఒక్కరు కాపాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ భీమేష్, పంచాయతీ కార్యదర్శులు, పరిశుద్ధ కార్మికులు, మండల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## కవ్వాల్లో 'ఫైర్ ట్రాక్'ల ఏర్పాటు

**జన్నారం, మార్చి 14 (ప్రభాత సమాచారం)** వేసవిలో అడవులకు నిప్పు అంటుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎఫ్డీఓ రామ్మోహన్ తెలిపారు. జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని చింతగూడ, పైడిపల్లి అటవీ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా రాలిన టేకు ఆకులను తొలగించి ఫైర్ ట్రాకులను శనివారం ఎఫ్ఎస్ఓ బొజ్జ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అటవీ మార్గాల్లో ప్రయాణించే వారు బీడీలు, సిగరెట్లు తాగి పడేయడం వల్ల మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.





## భూభారతి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, మండల స్థాయి అధికారులు గ్రామాల్లో ప్రజల ఆందోళనలు తొలగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్ నుండి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తో కలిసి జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా, పలు రెవెన్యూ అంశాలపై తహసిల్దార్లతో జూమ్ కాల్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రజలకు సరిపడినన్ని గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, ఈ విషయంలో ప్రజల భయాలు తొలగించాలని పేర్కొన్నారు. గృహవసరాల గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని అన్ని మండలాల్లో పకడ్బందీగా అమలు పరచాలని పేర్కొన్నారు. అన్ని కార్యక్రమాలలో అధికారులు స్వయంగా పాల్గొంటూ, ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మండలాల్లో భూభారతి దరఖాస్తులు పెండింగ్లో ఉంచకూడదని పేర్కొన్నారు. ఆయా పౌర సేవల ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం చేయకూడదని వివరించారు. మండల స్థాయి అధికారులంతా ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో, జూమ్ కాల్ ద్వారా జిల్లా ఎస్పీ జానకి షర్మిల పాల్గొన్నారు.



## పది పరీక్షలు ప్రశాంతం..

**బెల్లంపల్లి, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ కోసం బెల్లంపల్లి పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1069 మంది విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. 1065 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పట్టణంలోని సెంట్ మేరీస్ హై స్కూల్ పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థులకు గాను 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. యువసంఘటన హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 217 మందికి 215 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ బజార్ ఏరియా హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 219 మంది విద్యార్థులకు 2 18 మంది విద్యార్థులు హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 153 మంది విద్యార్థులకు గాను 152 మంది విద్యార్థులు హాజరు కాగా ఒక విద్యార్థి మాత్రమే గైర్హాజరయ్యారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ సీవోఈ పాటశాల పరీక్ష కంద్రంలో 240 మంది విద్యార్థులు హాజరయ్యారు. బెల్లంపల్లి పట్టణంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బంధవస్తు ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు నిర్ణిత కాలంలోనే తొలి రోజు పరీక్ష కేంద్రాలకు 8 గంటలకే చేరుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో అధికారులు తగిన సదుపాయాలను కలిపించినట్టు అధికారులు తెలిపారు.

## సంక్షేమ హాస్టల్లో గ్యాస్ కొరత లేకుండా చూడాలి




**నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
పశ్చిమ దేశాల్లో యుద్ధం కారణంగా సంక్షేమ హాస్టల్లో ఎల్పిజీ  గ్యాస్ కొరత లేకుండా చూడాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. ప్రస్తుతం వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరాల మేరకు గ్యాస్ సిలిండర్లను అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే

**లక్ష్మణచందా, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
లక్ష్మణచందా మండలంలోని పొట్ట పల్లి కేజీబీవీ పాఠశాలలో శనివారం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధనపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓపాల్గొన్నారు.



# ప్రజల సౌలభ్యం కోసమే ప్రజాపాలన కార్యక్రమం

## బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మున్సిపాలిటీలో ప్రజల సౌలభ్యం కోసమే ప్రజాపాలన ప్రణాళిక ప్రోగ్రామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం 23 వార్డులో ప్రజాపాలనా ప్రణాళిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. అందులో భాగంగా బెల్లంపల్లి పట్టణంలోని 23వ వార్డులో డ్రైనేజ్ వ్యవస్థను శుభ్రపరిచే పనులను చేపట్టామని తెలిపారు. ప్రజలకు



ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే 16వ వార్డులో కూడా డ్రైనేజ్ శుభ్రపరిచే పనులను ప్రారంభించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా 99 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని  పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, 23వ వార్డు కౌన్సిలర్ జంగం కల్పన, 16వ వార్డు కౌన్సిలర్ మత్తమర్రి రాజమల్లు, మున్సిపల్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన

**నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డులో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్టు నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి తెలిపారు. శనివారం పట్టణంలోని సిద్దాపూర్ రాంనగర్ ఆదర్శనగర్ కాలనీలో సందర్శించారు. కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నాయన వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ స్థానిక నాయకులు ఉన్నారు



# రూ.77.70 లక్షలతో అభివృద్ధి పనులు



**మామడ నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
మామడ  మండలం న్యూ సాంగ్వి గ్రామంలో రూ. 20 లక్షలతో చేపట్టిన భవనాల నిర్మాణానికి, రూ. 20 లక్షలతో వర్కింగ్ షెడ్ ల నిర్మాణానికి, రూ. 12 లక్షలతో అంగన్వాడి

## ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

భవన నిర్మాణానికి రూ. 25.70  లక్షలతో స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజా సమస్యలు, రైతుల సమస్యలు తెలుసుకొని, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, గ్రామ సర్పంచ్ అశ్విన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొంద్ర రాజారెడ్డి, మండల అధ్యక్షులు రంజిత్, సీనియర్ నాయకులు బాపు రెడ్డి, సర్పంచ్ లు సూరి,  తిరుపతి, మల్లయ్య, సచిన్, రాజేశ్వర్, నాయకులు  ప్రవీణ్, రాజు, చిన్నారెడ్డి, రమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మల్లన్న స్వామి ఆలయ ప్రారంభోత్సవం





**జన్నారం, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న స్వామి దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు శనివారం  అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నిర్మల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రితిష్  రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి భూమి ఇచ్చి సహకరించిన,తమ వంతు ఆర్థిక సాయం అందించి,అంకితభావంతో సహకరించిన దాతలను రితేష్ రాథోడ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. భక్తి భావం సమాజంలో ఐక్యతను పెంచుతుందని,ఆలయాల పునర్నిర్మాణంలో భాగస్వాములవ్వడం అదృష్టమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సేటుపల్లి రాజేశ్వరి  సత్యం గ్రామ సర్పంచ్ అల్లం మాధవి రవి, జన్నారం మండల బీజేపీ అధ్యక్షులు మధుసూదన్ రావు,ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్,కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు బెడద గోపాల్,జిల్లా నాయకులు శంకరయ్య,పొనకల్ ఉప సర్పంచ్ అప్పాల జలపతి,ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు అజ్మీరా బద్రి నాయక్, బిజేవైఎం రాష్ట్ర నాయకులు పవన్ యాదవ్, మండల స్థాయి పార్టీ నాయకులు,కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఆశ వర్కర్ల సమస్యలపై స్పందించాలి

**నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బడ్జెట్ల కేటాయింపు జరిగేలా చూడాలని ఆశా వర్కర్ యూనియన్ శనివారం ఎమ్మెల్యే నివాసంలో వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యేలు తక్షణ స్పందించాలని వారు నినాదాలు చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు సుజాత అధ్యక్షులు చంద్రకళ మాట్లాడుతూ.... అదేవిధంగా ఆశా వర్కర్లకు రూ.50 లక్షల బీమా, వైద్య ఖర్చులకు రూ.50 వేల ఆర్థిక సాయం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలని, పదవీ విరమణ సమయంలో రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరారు. వారానికి ఒక రోజు సెలవు, పండుగల సందర్భంగా సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆశా వర్కర్లకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు



**నిర్మల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనలను అతిక్రమించిన ఇతర అక్రమాలకు పాల్పడ్డ చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సాయికిరణ్ రూలర్ సిఐ కృష్ణ పోలీసులు ఉన్నారు.

## రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు

**బెల్లంపల్లి, మార్చి 14 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని 13వ వార్డు, కుంట రాములు బస్తీ వాసులు రోడ్డు సౌకర్యం లేక 20 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, 15రోజులలో రోడ్డు నిర్మాణం చేయిస్తానన్నారు.






## గ్రామీణ ప్రతిభకు పట్టం
# సరికొత్త ఆవిష్కరణలకు మార్గం

**ఆదిలాబాద్‌లో ఉత్సాహంగా**
**'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమం**
**యువ ఆవిష్కర్తలకు అండగా ఉంటాం**
**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** మారుమూల గ్రామాల నుంచి వెలువడుతున్న సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అందించి వాటిని పారిశ్రామిక స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన సుమారు 40 మందికి పైగా యువ ఆవిష్కర్తలు, విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులు, ఆలోచనలను ప్రదర్శించారు. ముఖ్యంగా వ్యవసాయానికి ఉపయోగపడే పరికరాలు, పర్యావరణహిత ఇంధన వనరులు, ఆరోగ్య రంగానికి సంబంధించిన వినూత్న నమూనాలు కార్యక్రమానికి హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అభివృద్ధి కేవలం మెట్రో నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉన్న ప్రతిభను వెలికితీయడం అవసరమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నూతన ఆవిష్కరణలను వెలికితీసి వాటిని వ్యాపార మార్గాలుగా మలచడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానికంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించేందుకు ఆదిలాబాద్ జిల్లాలో ప్రత్యేకంగా ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణుల బృందం ఆవిష్కర్తలతో ప్రత్యక్షంగా చర్చించి వారి ఆలోచనలను మరింత మెరుగుపరుచుకునే విధంగా మార్గనిర్దేశం చేసింది. ఐడియా వ్యాలిడేషన్, ప్రోటోటైపింగ్, గో–టు–మార్కెట్ స్ట్రాటజీ, నిధుల సమీకరణ, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆవిష్కర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం వినూత్న ఆలోచనలతో పాల్గొన్న యువకులు, విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి వారి ఆవిష్కరణల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమం అనంతరం ఆవిష్కర్తలను అధికారులు మెమెంటోలు, పూల మొక్కలతో సత్కరించారు. కార్యక్రమంలో డిపిఓ రమేష్, డిపిఆర్ఓ ఇ. విష్ణువర్ధన్, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఈడీఎం రవి, రెడ్కో డి.ఎం శ్రీనివాస్, వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ నికిత్ వర్మ, ప్రతినిధులు ప్రణయ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**బజార్‌హత్నూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ గోడం నాగేష్ శ్రీకారం చుట్టారు. శనివారం మండలంలోని అందుగూడ గ్రామపంచాయతీ నూతన భవనాన్ని, గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి, గోకుండా గ్రామ పంచాయతీ పరిధిలో నూతన పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి పలు పథకాలు ప్రవేశపెట్టరని తెలిపారు. ఈ పథకల ద్వారా మరో ఐదేండ్లలో గిరిజన ప్రాంతాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లు, బిజెపి నాయకులు అల్లు గణేష్, నానం రమణ, సూది నందు, సుఖదేవ్, రాజేశ్వర్, వెంకన్నా, భోజన్న, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


## పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** జిల్లాలో జరుగుతున్న పదో తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. శనివారం రెబ్బెన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని డీఈవో లలితతో కలసి ఆకస్మికంగా సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మందులు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బందిని నియమించాలని తెలిపారు. సీసీ కెమెరాల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించకూడదని సూచించారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్ పనులను వేగవంతం చేయాలి



**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** జిల్లాలో ప్రతిపాదించిన ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సంబంధించిన భూ సేకరణ, రైల్వే ఓవర్ బ్రిడ్జ్, అండర్ బ్రిడ్జ్ నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత జాబితాలో ఉందని, ముఖ్యమంత్రి కార్యాలయం దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. చనాక– కొరట ప్రాంతంలో మొత్తం భూమి అందుబాటులో ఉండగా, అందులో కొంత భాగం వివిధ సర్వే నంబర్లలో సాగు జరుగుతున్నట్లు అధికారులు నివేదించినట్లు చెప్పారు. సాగులో ఉన్న భూములు, రోడ్లు, ఇతర గోదాములను మినహాయించి ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు. భూ సేకరణ ప్రక్రియలో భాగంగా డ్రోన్ సర్వే పూర్తి చేసి, ఈ నెల చివరి నాటికి క్షేత్రస్థాయిలో భూమి కొలతల ప్రక్రియను ముగించాలని గడువు విధించారు. పట్టాదారులు, సాగుదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ మొదటి వారంలోపు భూ సేకరణకు సంబంధించిన తదుపరి ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, ఆర్ అండ్ బి ఈఈ నర్సయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ప్రభాకర్, సంబంధిత మండల తహసీల్దార్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో రెండో రోజూ ఏజెన్సీల ఎదుట బారులు




**ఆదిలాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ పట్టణవాసులను వంటగ్యాస్ కష్టాలు వెంటాడుతునే ఉన్నాయి. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లిలో గల ఓ గ్యాస్ ఏజెన్సీ వద్ద ప్రజలు బారులుదీరారు. ఉదయం సిలిండర్ల కోసం జనం ఏజెన్సీ కేంద్రానికి వచ్చారు. బుకింగ్ ప్రకారం కొందరికి సిలిండర్లు పంపిణీ చేసిన నిర్వాహకులు స్టాక్ అయిపోయిందని తెలిపారు. మిగతా వారికి రశీదులు రాసిచ్చి స్టాక్ వచ్చిన తర్వాత రావాలని సూచించారు. ఎప్పుడు వస్తుందని వినియోగదారులు నిర్వాహకులను అడుగగా.. చంద్రాపూర్ నుంచి రావాల్సి ఉందని, మధ్యాహ్నం 3 గంటలకు వరకు వచ్చే అవకాశాలున్నాయన్నారు. దీంతో వినియోగదారులు చేసేదేమి లేక ఖాళీ సిలిండర్లతో వెనుదిరిగారు. గ్యాస్ కొరత లేదని అధికారులు ప్రకటనలు జారీ చేస్తున్నా.. ఏజెన్సీ నిర్వాహకులు స్టాక్ అయిపోయిందని అంటున్నారని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆటో ఛార్జీలకు రూ.100 ఖర్చు చేయాల్సి వచ్చిందని మండిపడుతున్నారు. గ్యాస్ సిలిండర్ల కోసం రోజుల తరబడి తిరుగాల్సి వస్తున్నదని, నిబంధనల ప్రకారం తమకు అవసరమైన సిలిండర్లు పంపిణీ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. రశీదు ఇచ్చి మధ్యాహ్నం రమ్మన్నారు.. మా సిలిండర్ అయిపోవడంతో బుక్ చేసుకొని ఖాళీ సిలిండర్‌తో ఏజెన్సీ కేంద్రానికి వచ్చా. క్యూలైన్‌లో నిల్చొని లోపలికి వెళ్లిన తర్వాత నిర్వాహకులు రశీదులు రాసిచ్చారు. సిలిండర్ ఎప్పుడు ఇస్తారని అడిగితే స్టాక్ అయిపోయిందని, మధ్యాహ్నం వరకు స్టాక్ వస్తుందని చెప్పారు. ఫోన్ చేసి రమ్మన్నారు. దీంతో ఖాళీ సిలిండర్‌తో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. నాతోపాటు క్యూలైన్‌లో నిల్చొని ఉన్న చాలా మంది వినియోగదారులకు సిలిండర్లు దొరకలేదు. అధికారులు సిలిండర్ల వినియోగదారులకు అందేలా చర్యలు తీసుకోవాలి.

## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన
# ఏఎస్పీ చిత్తరంజన్

**ఆసిఫాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** పదవ తరగతి పరీక్షల సందర్భంగా ఆసిఫాబాద్ పట్టణంలోని పరీక్షా కేంద్రాలు, రెబ్బెన మండలంలోని జెడ్పీహెచ్ఎస్ కేంద్రాన్ని ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ శనివారం పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో 163 బీఎన్ఎస్ (సెక్షన్ 144) అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుమికూడకుండా పోలీసులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.కేంద్రాల సమీపంలోని 100 మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షల సమయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సిఐ లు బాలాజీ వరప్రసాద్,సంజయ్ పాల్గొన్నారు.



# సిద్ధమైన 'మహారాజ 2'



తెలుగు, తమిళంతోపాటు నార్త్‌లో కూడా సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న నటుడు కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడు. విజయ్ సేతుపతి టైటిల్ రోల్‌లో నటించిన మహారాజ తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కింది. మక్కళ్ సెల్వన్ 50 గా వచ్చిన ఈ చిత్రానికి కురంగు బొమ్మై ఫేం నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించాడు.కాగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సీక్వెల్ Maharaja 2 అప్‌డేట్‌పై ఇటీవలే క్లారిటీ ఇచ్చాడు విజయ్ సేతుపతి. నితిలన్ సామినాథన్ స్క్రిప్ట్‌ను పూర్తి చేశాడని.. త్వరలో నరేషన్‌ను వింటానని చెప్పాడు. ఈ ప్రాజెక్టు గురించి చాలా ఎక్జయిటింగ్‌గా ఉన్నట్టు కూడా చెప్పాడు. విజయ్ సేతుపతి అభిమానులతోపాటు, ఇండస్ట్రీ సర్కిల్‌లో సూపర్ హైప్ పెంచేసిన మహారాజ బ్లాక్ బస్టర్‌గా నిలిచిందని తెలిసిందే.

కొంతకాలంగా విజయ్ సేతుపతి నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయాయి. ఇక మహారాజ 2తో కమ్ హిట్ ఇవ్వాలని గట్టిగా ఫిక్సయ్యాడట. ఈ క్రమంలో సీక్వెల్‌పై అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.తమ ఫేవరేట్ యాక్టర్‌కు ఈ క్రేజీ సీక్వెల్ తప్పకుండా మంచి విజయాన్ని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి విజయ్ సేతుపతి ఈ ప్రాజెక్టును ఎప్పుడు సెట్స్‌పైకి తీసుకెళ్తాడనేది చూడాలి.



# రూ. 33 వేలతో తుంబాడ్

నానాటికీ సినీ నిర్మాణవ్యయం విపరీతంగా పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో రూ.33 వేలతో సినిమా తీయొచ్చా? అంటే 'ఏంటి జోక్ చేస్తున్నావా' అనేవాళ్లే ఎక్కువ. కానీ, తీయొచ్చు అని చెప్పడమే కాదు, తీసి చూపించారు రాహి అనిల్ బార్వే. ఈ పేరు ఎక్కడో విన్నట్లు ఉంది కదూ. అవును ఆయనే. 'తుంబాడ్' వంటి మిస్టరీ థ్రిల్లర్ తీసి అలరించిన దర్శకుడు. ఇప్పుడు 'మన్-పిశాచ్' పేరుతో కేవలం ఇద్దరు నటులతో ప్రయోగం చేశారు. తాజాగా ఇందుకు సంబంధించిన ట్రైలర్ విడుదలైంది. అది చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు, ఈ మూవీ మేకింగ్ ఎలా జరిగిందో అనిల్ ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు.ఈ సినిమా కోసం భారీ సెట్స్ వేయలేదు. ప్రస్తుతం మానవ జీవనగతినే మార్చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకున్నారు. దీనిని గురించి ఇన్‌స్టా వేదికగా చెబుతూ.. "మన్ పిశాచ్' స్క్రిప్ట్ కేవలం 60 పేజీలు. మేకింగ్‌లో ఎక్కువగా చేతితో గీసిన స్టోరీ బోర్డులు, ఐఫోన్‌తో తీసిన వీడియోలు, ఫొటోషాప్, జనరేటివ్ ఏఐ, ఆఫ్టర్ ఎఫెక్ట్స్ వాడి సినిమాను పూర్తి చేశాం" అని అనిల్ తెలిపారు. ఇక ఇందులో కేవలం ఇద్దరే నటులు. యానియా భరద్వాజ్, దీపక్ దమ్లే ఇందులో నటించారు.



# రూట్ మార్చిన రాశీ..

సినిమా ఇండస్ట్రీలో ఎవరి లక్కు ఎప్పుడు ఎలా కలసి వస్తుందో..ఎవరి అదృష్టం ఎలాంటి మలుపులు తిప్పుతుందో చెప్పడం కష్టం. ఎంత టాలెంట్ ఉన్నా ఇక్కడ కాలం కలిసి రాక, అదృష్టం లేకపోతే కష్టమే. ఆవగింజంత అదృష్టం ఉన్నా అందమెక్కే రోజులివి. అదే లేక టాలెంట్‌ని నమ్ముకుని ఇప్పటికీ సక్సెస్ కోసం ఏళ్లతరబడి ఎదురు చూస్తున్న వాళ్లెందరో..ఆ జాబితాలో ఉన్న హీరోయిన్ రాశిఖన్నా. స్టార్ హీరోయిన్ కావాల్సిన క్వాలిటీస్ అన్నీ ఉన్నా ఇప్పటికీ ఆ జాబితాలో చేరలేకపోతోంది. హీరోయిన్‌గా స్టార్ అనిపించుకోవడం కోసం యుద్ధం చేస్తూనే ఉంది.2014లో `ఊహలు గుసగుసలాడే` సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ఢిల్లీ సోయగం సినిమాల్లోకి యాక్సిడెంటల్‌గానే ఎంట్రీ ఇచ్చింది. ఐఏఎస్ ఆఫీసర్ కావాలన్న కలతో ఢిల్లీ లేడీ శ్రీరామ్ కాలేజీలో చేరిన రాశిఖన్నా అనుకోకుండా యాడ్ ఫిల్మ్స్‌లలో నటిస్తూ బాలీవుడ్ మూవీ `మద్రాస్‌కేఫ్`తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేసింది. తెలుగులో `ఊహలు గుసగుసలాడే`తో పరిచయమై తొలి సినిమాతోనే హిట్‌ని సొంతం చేసుకుని ఇండస్ట్రీ వర్గాల దృష్టిని ఆకర్షించింది. 22 ఏళ్ల కెరీర్‌లో తెలుగు, తమిళ భాషల్లో కలిపి ఏడంటే ఏడే సక్సెస్‌లని సాధించింది.కానీ స్టార్ డమ్‌ని, స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాల్ని సొంతం చేసుకోలేక ఇప్పటికీ రేసులో వెనకబడే ఉంది. నాగశౌర్య టు మాస్ మహారాజా రవితేజ వంటి టైర్ టు హీరోల సినిమాల్లో నటించిందే కానీ స్టార్స్, సూపర్ స్టార్స్ తో కలిసి నటించే అవకాశాన్ని మాత్రం దక్కించుకోలేకపోతోంది. ఇన్నాళ్లుకు రాశిఖన్నా ఫేట్ మారే టైమ్ వచ్చినట్టుగా తెలుస్తోంది. తన కెరీర్‌ని ఎనలైజ్ చేసుకున్న రాశిఖన్నా తాజాగా కొత్త గేమ్ ప్లాన్‌ని రెడీ చేసుకుని అందుకు తగ్గట్టుగా సినిమాలని ఎంచుకుంటున్నట్టుగా తెలుస్తోంది.ఇండస్ట్రీలోకి ప్రవేశించి ఏళ్లు గడుస్తున్నా భారీ స్టార్లతో నటించే అవకాశాన్ని దక్కించుకోలేక రేసులో వెనకబడిపోయింది. అయితే ఇప్పుడు `ఉస్తాద్ భగత్‌సింగ్`లో చేస్తున్న రాశి తన గేమ్ ప్లాన్‌ని మార్చుకున్నట్టుగా తెలుస్తోంది. పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న `ఉస్తాద్ గబ్బర్ సింగ్` మార్చి 19న భారీ స్థాయిలో రిలీజ్ అవుతున్న విషయం తెలిసిందే. ఇందులో శ్రీలీలతో కలిసి రాశిఖన్నా నటించింది. ఈ మూవీతో మంచి బ్రేక్ లభిస్తుందని భావిస్తున్న రాశీ ప్రస్తుతం బన్నీ నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీని టార్గెట్‌గా పెట్టుకుని ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.

# పదో తరగతి పరీక్షలు ప్రారంభం







**ఆసిఫాబాద్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** పదో తరగతి పరీక్షలు జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో పరీక్షల నిర్వహణ కోసం మొత్తం 38 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు రెగ్యూలర్ 6,943 మందికి గాను, 6,924 మంది హాజరయ్యారు. అలాగే ప్రైవేటులో 29 మందికి గాను 23 మంది హాజరు కాగా అరుగురు గైర్హజరయ్యారు. ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు పరీక్షలు జరుగగా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలలో తమకు కేటాయించిన గదులను పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి వెళ్లారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకొకుండా పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ కె హరిత తనిఖీ చేశారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఏఎస్పీ చిత్తరంజన్, డీఈవో లలిత సైతం పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించాలని అదికారులకు సూచించారు. వాంకిడి మండలంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 402 మంది పరీక్షలకు హాజరయ్యారు. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసిపర్యవేక్షణ కట్టుదిట్టం చేశారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. హాల్‌టికెట్ పరిశీలన అనంతరం విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి అనుమతించారు. రెబ్బెన మండలంలో జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 16వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట పరీక్ష ముఖ్య పర్యవేక్షకులు, శాఖాధికారులు, ఇన్విజిలేటర్లు, తదితరులు ఉన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఫాతిమాకాన్వెంట్, జడ్పీ పాఠశాల, శిశు మందిర్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. విద్యార్థులను తనిఖీ చేసిన తరువాత లోనికి పంపించారు. పరీక్షా కేంద్రాలను డీఎస్పీ వహీదుద్దీన్ తనిఖీ చేశారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 16 మంది విద్యార్థులు, కేజీబీవీ పాఠశాల సెంటర్‌లో 185 మంది విద్యార్థులు మొదటి పరీక్షలు రాశారు. మండలంలో 290 మంది విద్యార్థులకు గాను ఒక విద్యార్థి గైర్హాజరు అయినట్లు ఎంఈవో జయరాజు తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా బండయ్య, డీఓగా ఊశన్న, చీఫ్ సూపరింటెండెంట్‌గా రామయ్య, భీమయ్యలు వ్యవహరించారు. దహెగాం మండల కేంద్రంలోని కేజీబీవీలో 111, ప్రభుత్వ పాఠశాల కేంద్రంలో 170 మంది పదో తరగతి పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. సీఎస్‌లు శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, డీఓలు తిరుపతయ్య, శ్రీనివాస్‌లు విధులు నిర్వహించారు. కెరమెరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 168 మందికి గాను ఒక్క గైర్హాజరు కాగా మోడి ఆశ్రమ పాఠశాలలో 170 మందికి గాను అందరు హాజరైనట్లు ఎంఈవో ప్రకాష్ తెలిపారు. వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్‌లు పరీక్షా కేంద్రాల వద్ద బందో బస్తును పర్యవేక్షించారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందో బస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో తనిఖీ చేశారు.



## కాగజ్‌నగర్ పట్టణాభివృద్ధికి
# పాలకవర్గం కృషి చేయాలి

**కాగజ్‌నగర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)** కాగజ్‌నగర్ పట్టణాభివృద్ధికి పాటుపడేలా బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా అధ్యక్షతన శనివారం మున్సిపల్ బడ్జెట్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాల, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మాట్లడుతూ పట్టణాభివృద్ధి బడ్జెట్‌ను సక్రమంగా వినియోగించుకోవాల న్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా చేయాలన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్ ఆదాయం రూ.52.49 కోట్లు కాగా వ్యయం రూ.52.49 కోట్లకు అమోదించేందుకు ప్రతిపాదించారు. కాగా మున్సిపల్ వైస్‌చైర్మన్ అనధికారికంగా ఉపయోగిస్తున్నారంటూ శనివారం కలెక్టర్, మున్సిపల్ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనధికార వ్యక్తులు చాంబర్‌లోకి ప్రవేశిస్తూ కార్యాలయ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, వైస్ చైర్మన్ డాక్టర్ అనిత, కౌన్సిలర్లు, కమిషనర్ తిరుపతి పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు సర్కారు భరోసా.. బెల్లంపల్లిలో తోఫా పంపిణీ







**ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్**
**రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు**
**ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా కానుకలు**
**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**బెల్లంపల్లి, మార్చి 14 (ప్రభాత సమాచారం)** రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం బాబు క్యాంపు జామా మసీదులో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు, తోఫా పంపిణీ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, బెల్లంపల్లి మండల తహసిల్దార్ శ్రీనివాస్, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్ పర్సన్ స్వాతి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు తోఫా అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గానికి 3 లక్షల రూపాయలు కేటాయించి 750 తోఫా కిట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఈద్ కా తోఫా కార్యక్రమంలో భాగంగా ముస్లిం సోదరులకు కానుకలు అందజేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



**వాంకిడి, మార్చి 14 (ప్రభాత సమాచారం)** పదోతరగతిలో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి సూచించారు. వాంకిడి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను శనివారం డీడీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల, సరకులు, కూరగాయలు, తదితర వస్తువులను పరిశీలించారు. వంట సామాగ్రిని పరిశుభ్రంగా కడిగి వంటకాలు చేయాలన్నారు. మేనూప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. పదవతరగతి మొదటి రోజు పరీక్షలు ఎలా రాశారని విద్యార్థినులను అడిగి తెలుసుకు న్నారు. పరీక్షల మధ్యలో చదువుకోవడం కోసం మూడేసి రోజులు సమయం ఉన్నందున విద్యార్థులు గ్యాప్ పీరియడ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు సబ్జెక్టు వారిగా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. భయం లేకుండా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారా యణమూర్తి, వార్డెన్ పెందోర్ మంగవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కిందపడి ఒకరి మృతి

**మందమర్రి, మార్చి 14 (ప్రభాత సమాచారం)** మందమర్రి పట్టణంలోని రెండో జోన్‌లో నివాసముంటున్న జక్కనబోయిన లక్ష్మి (80) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు కింద పడడంతో మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నట్లు సీఐ రమేష్ తెలిపారు. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మి మందమర్రిలోని తన సొంత ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటోంది. గురువారం రాత్రి అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న ఎం.డి. రసూల్ అనే వ్యక్తి సుమారు రాత్రి 11 గంటల సమయంలో వెళ్లి చూడగా ఆమె కిందపడిన స్థితిలో కనిపించింది. వెంటనే ఎస్సై నరేష్‌కు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు పరిశీలించగా తల గడపకు తగిలి గాయమై కిందపడటంతో ఆమె మృతి చెందినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించగా, నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడవుతాయన్నారు.

### బాసర ట్రిపుల్ ఐటీని సందర్శించిన

# రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ముథోల్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

బాసర ఐఐఐటి ని, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా, ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా ఆయన మాట్లాడుతూ, వర్సిటీలో జరుగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందో లేదో అధికారులను అడిగారు. విద్యార్థుల రక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. మహిళా విద్యార్థుల కొరకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బందిని నియమించుకునే ప్రక్రియలో తప్పనిసరిగా రిజర్వేషన్ పద్ధతిని పాటించాలని ఆదేశించారు. వివిధ అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ, వారికి అందిస్తున్న వసతులు, వారికి ఉన్న సమస్యలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు అధికారులు, చైర్మెన్, సభ్యులను సన్మానించారు. జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్తం నీలాదేవి, వైస్‌చాన్స్‌లర్ గోవర్ధన్ పాల్గొన్నారు.



# చిరుతపులిని హతమార్చిన వేటగాళ్ల అరెస్టు

- ఉచ్చు వేసి చిరుతపులిని హతమార్చిన కిరాతకులు
- 13గోర్లు స్వాధనం చేసుకున్న అటవీ అధికారులు
- ఆధారాలు దొరకుండా మృతదేహం దహనం
- స్నిఫర్ డాగ్ 'హంటర్' సాయంతో నిందితుల గుర్తింపు





**జన్నారం, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాడ్లపేట రేంజ్‌లో చిరుతపులిని హతమార్చిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జన్నారం ఎఫ్‌డీఓ రాంమోహన్ శనివారం తెలిపారు. నిందితుల వద్ద నుంచి 13 చిరుత పులి గోర్లు సహా వన్యప్రాణులకు సంబంధించిన ఇతర వస్తువులను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దండేపల్లి మండలానికి చెందిన కొందరు వ్యక్తులు వన్యప్రాణి అవశేషాలను అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని అందిన సమాచారం మేరకు అటవీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఊట్ల గ్రామానికి చెందిన మొద్దె వెంకటేష్, మొద్దె శ్రీనివాస్, అలాగే పాతమామిడిపల్లి గ్రామానికి చెందిన వనపర్తి శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దర్యాప్తులో నిందితులు దండేపల్లి మండలం ఊట్ల గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మోటారు వాహనాల క్లచ్ వైర్లతో ఉచ్చులు వేసి చిరుతపులిని వేటాడినట్లు తేలింది. అనంతరం చిరుత పులి గోర్లను తొలగించి మృతదేహాన్ని కాల్చి వేసినట్లు అధికారులు గుర్తించారు. సం ఘటన జరిగిన ప్రదేశాల నుంచి అటవీ అధికారులు కీలక సాక్ష్యాలను సేకరించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 13 చిరుతపులి గోర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌డీఓ తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా 'హంటర్' అనే స్నిఫర్ డాగ్‌ను వినియోగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. దర్యాప్తు కొనసాగుతోంది.





### కాంగ్రెస్ పార్టీలో చేరిన

# బీజేపీ లీగల్ సెల్ నాయకుడు మట్టేరి రాజశేఖర్

**ఖానాపూర్, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సమక్షంలో బీజేపీ లీగల్ సెల్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు మట్టేరి రాజశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ న్యాయవాది రాజురా సత్యం ఆధ్వర్యంలో ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే సందర్భంగా యువ న్యాయవాది షేఖ్ ఖదీర్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన న్యాయవాది మట్టేరి రాజశేఖర్ మాట్లాడుతూ ఖానాపూర్‌లో కోర్టు భవనం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే జెఎఫ్‌సీఎం కోర్టుకు చాలా కాలంగా మేజిస్ట్రేట్ లేకపోవడంతో ఇంచార్జ్ మేజిస్ట్రేట్ ద్వారా శుక్రవారం మాత్రమే కోర్టు నడుస్తోందని తెలిపారు. దీనివల్ల న్యాయవాదులు మరియు కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సమస్యను వెంటనే ప్రభుత్వ న్యాయ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజురా సత్యం, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, ఏజీపీ ఆసిఫ్ అలీ, హైకోర్టు న్యాయవాది పొలంపల్లి రాజు, న్యాయవాదులు బాశెట్టి శివకుమార్, బక్కశెట్టి కిషోర్, షేఖ్ ఆంజర్, షేఖ్ ఖదీర్, రాచమల్ల అశోక్, భూమి రవి తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలి

**వాంకిడి, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

వైద్య సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని డీఎంహెచ్ వో సీతారాం అన్నారు. శనివారం వాంకిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రూంలోని మందుల నిల్వలు. హెచ్పీవీ వాక్సిన్ సెంటర్‌లతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వైద్యసి బ్బంది స్థానికంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

### జన్నారం మండల కేంద్రంలో

# ఘనంగా ఇఫ్తార్ విందు

**జన్నారం, మార్చి 14 (ప్రభాత సమాచారం)**

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో పొనకల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మ, భూమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ పర్వదినం సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించడం సమాజానికి శాంతి, అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడివో ఉమర్ షరీఫ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు కుదిరే వెంకన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫసి ఉల్లా, మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యం సతీష్, మామిడిపెల్లి ఇందయ్య, మౌలానా, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

